కేన్సర్ బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యాన బుధవారం కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు అందించిన రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన టెన్నిస్ ప్లేయర్స్ చేతుల మీదుగా వడ్లవానిపాలెం గ్రామానికి చెందిన సాగిరాజు బేబి, చింతపర్రు గ్రామానికి చెందిన తొంట వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా పాతపాడుకు చెందిన కొప్పిడి వెంకన్న, అదే జిల్లాకు చెందిన దమ్ము లక్ష్మిలకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.40 వేలను అందించారు. ఈ సందర్భంగా కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు, టెన్నిస్ ప్లేయర్స్ రాధాకృష్ణన్, అరిటాకుల రాంబాబు, భాస్కరరావు, విఎస్.నాయుడు, బున్ రాజు, గణపతి రాజు పాల్గొన్నారు.

జిల్లాలపై సస్పెన్స్..!

క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోకుండా మౌనం

మళ్లీ ప్రక్రియను పక్కకు పట్టేశారా అన్న అనుమానాలు

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలపై ఉత్కంఠ

రెండు డివిజన్లతో జిల్లాల ఏర్పాటు ప్రచారంపై చర్చ

ప్రభుత్వం ఏకపక్షంగా వెళ్తోందన్న అభిప్రాయం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాల విభజనలో మార్పులు చేర్పులపై ప్రభుత్వం మౌనం దాల్చిన పరిస్థితి నెలకొంది. ఈ నెల పదో తేదీన జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల్లో మార్పులపై కచ్చితమైన నిర్ణయం వస్తుందని ప్రజాప్రతినిధులు చెప్పారు. అయితే అందుకు విరుద్ధంగా మంత్రి మండలి సమావేశంలో జిల్లాల మార్పులు, చేర్పుల ఊసేలేకుండా పోయింది. దీంతో జిల్లాల మార్పులపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందా అన్న అనుమానాలు నెలకొన్నాయి. జిల్లాల మార్పులు చేర్పుల ప్రక్రియలో ఏలూరు జిల్లాపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్న ప్రచారం సాగుతోంది. దీంతో ఏలూరు జిల్లాలో ఇంక రెండు డివిజన్లు మాత్రమే మిగలనున్నాయి. అతిచిన్న జిల్లాగా మారనుండడంతో జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. ఈ ప్రక్రియపై ప్రజాప్రతినిధుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనట్లు తెలుస్తోంది.



రాష్ట్రంలో మిగిలిన జిల్లాలోనూ ఇలాంటి సమస్యలు ఉండడంతో ప్రభుత్వం సందిగ్ధంలో పడినట్లు సమాచారం. గత వైసిపి ప్రభుత్వం 2022 ఏప్రిల్‌లో జిల్లాల విభజన చేసింది. పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికగా జిల్లాల విభజన జరిగింది. గతంలో కృష్ణా జిల్లాలో ఉన్న కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలు ఏలూరు పార్లమెంట్ స్థానంలో ఉండేవి. జిల్లాల విభజన నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలు ఏలూరు జిల్లాలో కలిపారు. అక్కడి ప్రజలు మాత్రం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎన్నికల్లో నూజివీడులోని బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబుకు దీనిపై అక్కడి నాయకులు, ప్రజలు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దీంతో అధికారంలోకి వచ్చాక నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామంటూ చంద్రబాబు మాటిచ్చారు. ఏజెన్సీ ప్రాంతాలను కలుపుతూ పోలవరం నియోజకవర్గం ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచిపోతోంది. దీంతో జిల్లాల విభజన మార్పులపై మంత్రుల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మంత్రుల కమిటీ జిల్లాల్లో పర్యటించి ప్రజల నుంచి వినతులు స్వీకరించిన తర్వాత మార్పులు చేర్పులు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. మంత్రుల కమిటీ ఏ జిల్లాలోనూ పర్యటించలేదు. అమరావతికి వచ్చిన వినతులను మాత్రమే తీసుకుని జిల్లాల మార్పులపై నివేదికను తయారు చేసిన సిఎంకు ఇచ్చింది. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపనున్నట్లు సమాచారం వచ్చింది. పోలవరం జిల్లా లేనట్లుగా పేర్కొన్నట్లు తెలిసింది. గణపవరం మండలాన్ని తిరిగి ఏలూరు జిల్లాలో కలపనున్నట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఉన్న నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను విడదీస్తే ఏలూరు జిల్లా అతిచిన్నగా మారిపోనుంది. ఏలూరు, జంగారెడ్డిగూడెం రెండు డివిజన్లు మాత్రమే మిగలనున్నాయి. ఈ నిర్ణయంపై ప్రజాప్రతినిధులు పైకి మాట్లాడకపోయినా ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు చెబుతున్నారు.

ఏకపక్షంగా చేస్తున్నారన్న విమర్శలు..

జిల్లాల మార్పులు, చేర్పులపై ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకెళ్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రుల కమిటీ ప్రజల నుంచి వినతులు స్వీకరించకుండా, ఎవరి అభిప్రాయం తెలుసుకోకుండా నివేదిక ఎలా తయారు చేస్తుందన్న చర్చ జనాల్లో నడుస్తోంది. జిల్లాల విభజన నేపథ్యంలో కూడా మండలాల భౌగోళిక పరిస్థితులను ఏమాత్రమూ పరిగణలోకి తీసుకోకుండా ముందుకు సాగుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ప్రత్యేక అథారిటీ ఏర్పాటు అంటూ చెప్పడంపై గిరిజనుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. డిసెంబర్‌లోపు జిల్లాల మార్పులు, చేర్పులు పూర్తి చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రెండు రోజుల క్రితం జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల సమస్యలపై ఎందుకు చర్చించలేదన్న అనుమానం నెలకొంది. జిల్లాల మార్పులు, చేర్పులపై అన్నివర్గాల అభిప్రాయాలు తీసుకుని ముందుకు సాగితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తాం

గృహప్రవేశం కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఆకివీడు

పేదల కాలనీల్లోని సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ నాగరాణి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ సహకారంతో ప్రభుత్వ ఏర్పాటు చేసిన కాలనీలో నిర్మించిన ఇళ్లకు గృహస్తులతో బుధవారం గృహ ప్రవేశాలు చేయించారు. ఈ మేరకు తాళ్లకోడేలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కంకణాల కృష్ణవేణికి చెందిన ఇంటికి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడారు. అన్ని సమస్యలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తుందని చెప్పారు. అనంతరం ఇంటి యజమాని కంకణాల కృష్ణవేణి మాట్లాడుతూ తాను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిశానని, పూర్తిగా ఇల్లు నిర్మించుకోలేనని ఆయనకు చెప్పడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందించారని, దీంతో నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. అనంతరం కాలనీలోని మరి కొంతమంది స్థలాలకు పట్టాలు, మరికొన్ని ఇళ్ల నిర్మాణానికి రుణ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు గ్రామ సర్పంచి ముత్యాల అనూరాధ, ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, టిడిపి మండల మాజీ అధ్యక్షులు మోటుపల్లి రామ్ వరప్రసాద్, ప్రస్తుత అధ్యక్షులు కోలె సాయిబాబు, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకోడేలో గృహప్రవేశం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలి

జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగ, కార్మిక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభ డిసెంబర్ 31, వచ్చే ఏడాది జనవరి 1, 2, 3, 4వ తేదీల్లో జరగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు భీమవరం టౌన్ విస్తృత సమావేశం నాయకులు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. ఈ మహాసభ ముగింపు సందర్భంగా లక్ష మంది ఉద్యోగ, కార్మికులతో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, కార్మికులకు భద్రత లేకుండా పోయిందని విమర్శించారు. కొత్త పరిశ్రమ ఒక్కటి కూడా స్థాపించలేదని, ఉన్న పరిశ్రమలు మూసేసి నిరుద్యోగం పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చారని, వాటి వల్ల కార్మిక వర్గానికి తీవ్ర నష్టమని, వాటిని తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దు చేసే అధికారం మోడీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. రైతుకు పండించే పంటకు గిట్టుబాటు ధర లేదని, వినియోగదారులపై విపరీతమైన భారాలు, అధిక ధరలు అరికట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు మహాసభ జయప్రదం కోసం కార్మిక వర్గం పట్టు వదలకుండా కృషి చేయాలని కోరారు. రానున్న కాలంలో ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు డి.నాగేశ్వరరావు, పి.రాజేశ్వరి, జి.జనార్దన్‌రావు, బి.వరలక్ష్మి, నీలాపు రాజు, పిన్నింటి శ్రీను, పి.సత్యనారాయణ, భార్గవ, పి.లక్ష్మణ్, కలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాసుదేవరావు

మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కృష్ణకిరణ్

నరసాపురం: విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించాలని లేని పక్షంలో చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణ కిరణ్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని స్టేషన్ పేటలోని ఫిషరీస్ గురుకుల పాఠశాల, మండలంలోని లక్ష్మణేశ్వరం బాలికల గురుకుల పాఠశాల, ఎల్‌బి.చర్ల బాలుర గురుకుల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ వివరాలను ఆరా తీశారు. విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌పేట విద్యార్థులు తమకు సక్రమంగా భోజనం పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో వండిన బియ్యం వివరాలను ఆరా తీశారు. 51 కేజీలు ఉండాల్సి ఉండగా, 34 కేజీలే ఎందుకు ఉపయోగించారంటూ సిబ్బందిని నిలదీశారు. దీనిపై జెసికి ఫిర్యాదు చేస్తానన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు జిల్లాలోని హాస్టళ్లు, అంగన్‌వాడీ, స్కూళ్లను తనిఖీ చేస్తామన్నారు. హాస్టల్ పరిశుభ్రంగా లేకపోయినా మెనూ అమలు చేయకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే 9963985678 నంబరుకు ఫోన్‌చేసి చెప్పొచ్చన్నారు. లక్ష్మణేశ్వరం నక్కావారిపేట బాలికల గురుకుల పాఠశాలలో ఆయన భోజనం చేశారు. ఆయన వెంట డిఇఒ నారాయణ, ఐసిడిఎస్ ఊర్మిళ, ఎంఇఒలు పుష్పరాజ్యం, జాన్ ప్రభాకర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు దుర్గా భవాని, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: మండలంలోని బ్రాహ్మణ చెరువులోని సివిల్ సప్లై గొడౌన్‌ను రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కృష్ణకిరణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలు, గొడౌన్ స్టాక్ ఇన్‌ఛార్జి అర్జునుడిని అడిగి తెలుసుకున్నారు. తూనికలు సక్రమంగా ఉన్నాయా లేవా అని జిల్లా అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. దీనిలో భాగంగా కొలతలు ఇన్‌స్పెక్టర్ మోహన్, టి.రాంబాబు తూకం కాటాను పక్క కాటాకు వ్యత్యాసాన్ని పరిశీలించారు. అలాగే సివిల్ సప్లై చౌక డిపోలకు చేసే బియ్యం తూనికలను పరిశీలించారు. అంతా సవ్యంగా ఉందని ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. తూనికల ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో పాటు, స్థానిక రెవెన్యూ శాఖ డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ సిబ్బందితో మాట్లాడుతున్న కృష్ణ కిరణ్

పశువుల ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి పశువుల ఆసుపత్రిని పశు గణాభివృద్ధి శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ జావర్ హుస్సేన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించగా సర్వీస్ రికార్డులు అసంపూర్తిగా ఉండడంతో అసిస్టెంట్ డైరెక్టర్ టి.శ్రీదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆసుపత్రిలో అటెండర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా వేరే చోటికి బదిలీ కాగా ఆమె సర్వీసు రికార్డు అసంపూర్తిగా ఉండడంతో జావర్ హుస్సేన్ అన్ని రికార్డులను తనిఖీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న టి.శ్రీదేవి పనితీరు వల్ల సిబ్బందికి అవసరమైన ఎర్న్ లీవ్, ఇంక్రిమెంట్లు రావడానికి వీల్లేకుండా అయిపోయిందని శ్రీదేవి పనితీరు మార్చుకోవాలని జావర్ హుస్సేన్ హెచ్చరించారు. ఇదిలా ఉండగా మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కలిసిపూడిలో గేదెకు అత్యవసర చికిత్స చేయాల్సి రావడంతో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎల్ఎస్ఎగా పనిచేస్తున్న ఉదయ భాస్కర్ ఆకివీడు అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశ్వరరావు సహాయంతో పశువుకు గుడ్లమయ వ్యాధికి శస్త్ర చికిత్స చేసి ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేయడంతో ఉదయ్ భాస్కర్, మల్లేశ్వరరావును జావర్ హుస్సేన్ అభినందించారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం - సంఘం ఆధ్వర్యంలో నిరసన

నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - పాలకోడేరు

ఇటీవల వచ్చిన తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం డిమాండ్ చేశారు. వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, తక్షణం నష్టపరిహారం అందించాలని తెలిపారు. తెలంగాణ మాదిరి క్వింటాకు రూ.500 బోనస్ కలిపి రూ.3 వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఆక్వా, వరి రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం మంది వ్యవసాయ రంగం పైనే ఆధారపడి జీవిస్తున్నారని, రైతులకు మాత్రం గిట్టుబాటు ధర కల్పించలేకపోవడం దారుణమని తెలిపారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఎరువులు, పురుగుమందులు, డీజిల్, పెట్రోలు, కరెంటు ఛార్జీలు, రకరకాల పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ట్రంప్ సుంకాల విధింపుతో ఆక్వారంగం సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రైతులను కనీసం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం, నేతలు శేషాపు అశ్రియ్య, పాల వెంకటస్వామి, వెంకటేశ్వరరావు వెంకన్న, రైతులు, కవులు రైతులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

వ్యకాస జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జార్జి, సత్యనారాయణ

- మరో 27 మందితో నూతన కమిటీ ఎన్నిక
- 10 తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - భీమవరం

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే 17 మంది కమిటీ సభ్యులతో పాటు మొత్తం 27 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 32వ మహాసభలు అత్తిలి షాదిఖానా భవనంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్నాయి. గత మూడు సంవత్సరాల కాలం నుండి పనిచేసిన కమిటీ రద్దు కావడంతో మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బాతిరెడ్డి జార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కౌరు పెద్దిరాజు, బల్ల చిన వీరభద్రరావు, కండెల్లి సోమరాజు, జక్కంశెట్టి వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా యడ్ల చిట్టిబాబు, శేషపు ఆశ్రియ్య, షేక్ పాదుషాతో పాటు మరో 17 మంది కమిటీ సభ్యులుగా మొత్తం 27 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మహాసభలో 10 తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో నిర్వహించబోయే పోరాట కర్తవ్యాలతో పాటు జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

అధ్యక్ష కార్యదర్శులు జార్జి, సత్యనారాయణ

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ తగదు

పలుచోట్ల వైసిపి ఆధ్వర్యాన ప్రజాఉద్యమ ర్యాలీలు

ప్రజాశక్తి - ఆచంట

మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేస్తే పేదవాడికి వైద్యం ఎలా అందుతుందని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం వైసిపి ఆధ్వర్యాన 'ప్రజా ఉద్యమం' ర్యాలీ పోడూరు మండలం తూర్పుపాలెం నుంచి ఆచంట తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ రద్దు చేయాలంటూ వైసిపి నాయకులు తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పించడానికి వస్తే ఆయన కార్యాలయంలో అధికారులెవ్వరూ లేకపోవడం వినతి పత్రాన్ని కార్యాలయం గోడకు రంగనాథరాజు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో మెడికల్ కాలేజీలను తీసుకువస్తే ప్రస్తుత ప్రభుత్వం ప్రయివేటీకరించాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రజల అభిప్రాయాలను రిప్రజెంటేషన్ రూపంలో తెలియజేయడానికి వస్తే తహశీల్దార్ కార్యాలయంలో ఉన్నతాధికారులు ఎవరూ లేకపోవడం దురదృష్టకరమన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పూలపల్లి దగ్గులూరు వద్ద మెడికల్ కాలేజీకి 60 ఎకరాల భూసేకరణ చేసి చిన్న సన్నకారుల నుంచి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు కడతామని హామీ ఇచ్చి భూసేకరణ చేస్తే దానిని ప్రయివేటు వ్యక్తులకు అప్పగించడం చాలా బాధాకరమని, ఆ భూమిని సేకరించడంలో ప్రధాన పాత్ర పోషించానని రంగనాథరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 10వ తేదీ నుండి నవంబర్ 22 వరకు నియోజకవర్గంలో 60 వేల సంతకాలు సేకరించామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు ఖండవెల్లి వాసు, ఎంపిపి కర్రి వాసిరెడ్డి, సబ్బితి సుమంగళి, మండల కన్వీనర్లు గూడూరి దేవేంద్రుడు, పిల్లినాగన్న, జక్కంశెట్టి చంటి, నల్లిమెల్లి బాబిరెడ్డి, కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారాం పాల్గొన్నారు.

పాలకొల్లు : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా పాలకొల్లులో వైసిపి నేతలు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పాలకొల్లు వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి సారధ్యంలో గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చెల్లెం ఆనంద్ ప్రకాష్, నడపన గోవిందరాజులు ర్యాలీ ముందుడి నడిపారు. ప్రధాన రోడ్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి నేతలు చిలువూరి కుమార దత్తాత్రేయ వర్మ, కోరాడ శ్రీనివాస్, ఉచ్చుల స్టాలిన్, పెనుమత్స యేసు రాజు, కొర్రపాటి వీరాస్వామి, ఎంపిపి ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్, కర్రా జయసరిత, మద్దా చంద్రకళ పాల్గొన్నారు.

ఆచంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నేతలు

తాడేపల్లిగూడెంలో ఆర్‌డిఒకు వినతిని అందజేస్తున్న నేతలు

నరసాపురం: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేస్తే సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య చదువులు దూరమయ్యే ప్రమాదం ఉందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు, పార్లమెంట్ కన్వీనర్ గుడూరి ఉమాబాల ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలో వైసిపి కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ వైసిపి ఆధ్వర్యాన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ప్రసాదరాజు, ఉమాబాల మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు అధికారాన్ని కట్టబెడితే ప్రభుత్వం వాటిని తుంగలోకి తొక్కి స్వార్థ ప్రయోజనాల కోసం వైద్య కళాశాలను ప్రయివేటీకరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పిడి రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, పప్పుల రామారావు, బొక్క రాధాకృష్ణ, అంద్రాజు చల్లారావు, యర్రా శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : 19 ఏళ్ల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్క మెడికల్ కాలేజీ కూడా తీసుకురాలేదని, ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతోనే మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు పూనుకున్నారని మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈమేరకు ఆయన మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం పట్టణంలోని వైసిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, మాజీ ఎంఎంసి ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉండి: పి-4 విధానంలో భాగంగా మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయడం ద్వారా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని వైసిపి జిల్లా పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ పివిఎల్ నరసింహారాజు విమర్శించారు. బుధవారం ఉండి మెయిన్ సెంటర్ నుంచి మండల తహశీల్దార్ కార్యాలయం వరకు మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మండల అధ్యక్షులు పివిఆర్‌కె.ఆంజనేయరాజు ఆధ్వర్యాన నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని మండల తహశీల్దార్ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు.

వికలాంగులకు ప్రభుత్వం చేయూత : కలెక్టర్

భీమవరం : ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగులను ఎంతో ఓర్పుతో సాకాల్సి ఉంటుందని, మీ ఇబ్బందులకు ఎల్లప్పుడూ ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని, ధైర్యంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పట్టణంలోని గాలి రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత విలీన విద్య వనరుల కేంద్రం ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగ బాల బాలికల ఉచిత ఉపకరణాల పంపిణీ వైద్య నిర్ధారణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన వికలాంగ బాలబాలికలను చాలా శ్రద్ధగా, ఓర్పుతో చూడవలసిన అవసరం ఉందని, దీనికి వారి తల్లిదండ్రులు పడే ఆవేదన ఏమిటో తాను అర్థం చేసుకోగలనన్నారు. ఇటువంటి పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం భవిత విలీన విద్యా వనరుల కేంద్రాలను ఏర్పాటు చేసి వారికి విద్యను, ఫిజియోథెరపీ తదితర సేవలను అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరాలను ఈనెల 10వ తేదీ నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 13న ఉండి నియోజకవర్గంలోని ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాలకు సంబంధించి ఉండి ఎంపీపీ స్పెషల్ స్కూల్లో, 14వ తేదీన నరసాపురం నియోజకవర్గం సంబంధించి నరసాపురం, మొగల్తూరు మండలాలకు నరసాపురం శ్రీహరి పేట ఎంపీపీ స్కూల్లో, 15న తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలకు పెంటపాడు పోస్ట్ బేసిక్ గర్ల్స్ హై స్కూల్లో, నవంబర్ 17న తణుకు నియోజకవర్గానికి సంబంధించి తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు తణుకు మున్సిపల్ పిఎస్ అండ్ హెచ్‌ఎస్ నెంబర్ 1లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో శిబిరాలను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని, సుమారు రూ.10.46 లక్షల విలువైన ఉపకరణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం, ఐఇ కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్, హెడ్మాస్టర్ పి.శ్రీనివాసరావు, ఐఇఆర్‌టి పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి మూర్తి రాజు : కలెక్టర్

భీమవరం : చదువే అభివృద్ధికి మూలం అని గ్రహించిన మహోన్నత వ్యక్తి, విద్యాదాత చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్ (మూర్తిరాజు) అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విద్యకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించిన మూర్తి రాజు దాతృత్వం అనుసరణీయమని కొనియాడారు. మూర్తి రాజు 13వ వర్ధంతి సందర్భంగా జువ్వలపాలెం రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని మూర్తి రాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 110 సంవత్సరాల క్రితమే విద్య ఎంత అవసరమో, మరీ ముఖ్యంగా ఆడపిల్లలకు ఎంత అవసరమో గుర్తించి వందలాది విద్యాసంస్థలను నెలకొల్పిన మహనీయుడు మూర్తి రాజు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. జిల్లా సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, మానవతా ప్రతినిధులు చింతలపాటి రామకృష్ణరాజు, బుద్ధరాజు వెంకటపతి రాజు, పెనుమత్స రామ్మోహన వర్మ, అల్లూరి సీతారామరాజు సేవా సమితి ప్రతినిధులు కలిదిండి గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు.

గణపవరం: గ్రామీణ ప్రాంతాల్లో విద్య విస్తరణకు వందలాది ఎకరాలను దానం చేసిన మాజీమంత్రి చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద్ మూర్తిరాజు కృషి వెలకట్టలేనిదని అఖిల భారత హ్యాండ్‌లూమ్ మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. మూర్తిరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ మహిళలకు విద్య అందించడానికి మూర్తిరాజు చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘ నాయకులు పల్లపోతు శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

లక్ష్మణేశ్వరం, దర్భరేవులో ఎంఎల్ఎ సందర్శన

నరసాపురం: మండలంలోని లక్ష్మణేశ్వరం, దర్భరేవు గ్రామాలలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఇరిగేషన్, సంబంధిత శాఖాధికారులతో కలిసి పంట కాలువలు, పంట బోధులు, నీటి వనరులను పరిశీలించారు. లక్ష్మణేశ్వరం గ్రామంలోని స్లూయిస్ గేట్‌ను పరిశీలించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి గేట్ కావడంతో తీవ్రంగా దెబ్బతిందని గమనించి, సంబంధిత అధికారులను వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులతో సమావేశమై పంటలకు నీటి సరఫరా, కాలువల నిర్వహణపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. పంట కాలువలలో గుంపులు, గుర్రపుడెక్కలు పెరగడం వల్ల నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతోందని గుర్తించి, వాటిని తక్షణమే శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా డెల్టా వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, మండల అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్, నిప్పులేటి తారకరామారావు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసిన బండి ముత్యాలమ్మ అమ్మవారి ఉండి ఆదాయాన్ని బుధవారం లెక్కించామని ఆలయ కార్యనిర్వహణ అధికారి మోక అరుణ్ కుమార్ తెలిపారు. యాత్రికులు గత 55 రోజులుగా కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించుకున్న హుండీ ఆదాయం రూ.12,05,166 నగదు సమకూరిందని అరుణ్ కుమార్ తెలిపారు. భీమవరం దేవాలయాల తనిఖీదారుడు వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీ ఆదాయం లెక్కించామని ఇఒ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ పాత్రికేయునికి ఆర్థిక సాయం

పోడూరు : ఇటీవల ఇంటి వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డ సీనియర్ పాత్రికేయులు కొట్టి రామంను బుధవారం ప్రెస్ క్లబ్ కార్యవర్గం పరామర్శించింది. అలాగే ప్రెస్ క్లబ్ తరపున ఆయనకు రూ.7 వేల ఆర్థిక సాయం అందజేశారు. రామం కొద్దిరోజుల కిందట వేడంగి గ్రామంలో తన ఇంటి వద్ద ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. దీంతో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆయనను చికిత్స నిమిత్తం హుటాహుటీన పాలకొల్లులోని ఒక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం రామంను విజయవాడ గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకుని అనంతరం నాలుగు రోజుల కిందట ఆయన స్వగ్రామానికి విచ్చేశారు. పోడూరు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మానుకొండ అంజిబాబు, సీనియర్ పాత్రికేయులు కుడిపూడి నరసింహారావు, కాకర వెంకటేశ్వరరావు, పి.వసంత్, టి.శేఖర్, జి.విజయకుమార్‌లు రామంను ఆయన నివాసంలో కలిసి పరామర్శించినట్లు తెలియజేశారు.

మెప్మా ఆధ్వర్యాన సఖీ సురక్ష మెగా హెల్త్ క్యాంప్

నరసాపురం: మెప్మా ఆధ్వర్యాన సఖీ సురక్ష మెగా హెల్త్ క్యాంప్ అంబేద్కర్ భవనంలో నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌ను విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించి మాట్లాడారు. మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ వైద్య క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యులు చెప్పిన సలహాలు, సూచనలు పాటించి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతీ మహిళ ఆరోగ్యంగా ఉంటే తద్వారా ఆమె కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, అందువల్ల ప్రభుత్వం మహిళల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఇలాంటి క్యాంప్‌లను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జనసేన నాయకులు పొలిశెట్టి శ్రీనివాస్, మెప్మా జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు, పాఠశాలల్లో తనిఖీ

పాలకొల్లు రూరల్ : మండలంలోని దిగమర్రు గ్రామంలో రేషన్ షాప్ నెంబర్ 35, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో ఆర్డీఓ/జిల్లా ఫుడ్ కమిషన్ మెంబర్ జె.శ్యామ్ కిరణ్ తనిఖీలు నిర్వహించారు. రేషన్ షాపులో స్టాక్, రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంలో భోజనం రుచి, శుచి శుభ్రత, కోడి గుడ్డు బరువు పరిమాణాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. రేషన్ షాపులో పంపిణీ చేస్తున్న వస్తువుల వివరాలు, వాటి నాణ్యతను రేషన్ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వై.దుర్గా కిషోర్, సివిల్ సప్లై డిటి నాగ దుర్గాదేవి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిడిఒ

పెనుమంట్ర : గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్, సభ్యులు, కార్యదర్శులు కలిసి యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఎంపిడిఒ ఎస్ఎన్ఎవిఎల్.కృష్ణమూర్తి కోరారు. బుధవారం పెనుమంట్ర మండల పరిషత్ మీటింగ్ హాల్లో జరిగిన సర్పంచి, కార్యదర్శుల రెండు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన కోర్సు డైరెక్టర్‌గా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఉన్న వనరులు గుర్తించి, వాటిని అభివృద్ధి చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చేయాలని మండల కార్య నిర్వహణాధికారి జి.శ్రీదేవి అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి వల్లభ రాంబాబు, కోర్సు రిసోర్స్ పర్సన్ వి.జ్ఞాన పవన్, ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కృషిచేయాలని ఎంపిడిఒ సి.హెచ్.త్రిశూలపాణి సూచించారు. పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు పెంపొందించి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముమ్మరంగా టెన్నిస్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు

పాలకొల్లు : పాలకొల్లు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యాన జరుగుతున్న సి.హెచ్.బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు బుధవారం నరసాపురంలోని ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో ముమ్మరంగా జరిగినట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టిముక్కల బాలరాజు తెలిపారు. ఉన్న 2 కోర్టులు, పాలకొల్లు టౌన్ హాల్ కోర్టు, కాస్మో కల్చర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోర్టులలో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు, గురువారం సెమీఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని, శుక్రవారం 45, 55, 65, 70 విభాగాలలో ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. మ్యాచ్ అతిథులుగా మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం టిడిపి ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, పాలకొల్లు ఎఎంసి చైర్మన్ కోడి విజయభాస్కర్, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

నేడు మెడ్ యునైటెడ్‌లో న్యూరో వైద్యం

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరు మసీదు సెంటర్ ప్రాంతంలో ఉన్న కెసిఆర్ కాంప్లెక్స్‌లో మెడ్ యునైటెడ్ క్లినిక్‌లో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ అలమండ అనుపమ అందుబాటులో ఉంటారని ఆ సంస్థ నిర్వాహకులు సామా కృష్ణ భగవాన్ తెలిపారు. తల, మెడ, నడుం నొప్పులు, మైగ్రేన్, ఎపిలెప్సీ(అపస్మారక వ్యాధి), స్ట్రోక్(పక్షవాతం), కండరాల బలహీనత, మతిమరుపు, నిద్ర పట్టకపోవటం, నరాల సమస్య, స్పైన్, బ్రెయిన్ ట్యూమర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులు, నొప్పులకు సమాచారం ఫీజుతో వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రయాణికులకు నీడ కరువు

- రహదారిపై నిరీక్షణ
- బస్టాండ్ నిర్మించాలని వేడుకోలు

రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో ప్రయాణికులకు నిలువ నీడ లేదు. బస్టాండ్ నిర్మిస్తామని పాలకులు పదే పదే ఎన్నికల హామీలు గుప్పించి ఆచరణలో మాత్రం హామీలుగానే మిగులు పోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నానా అవస్థలు పడుతున్నారు. 18 గ్రామాలకు ప్రధాన కూడలి ఆచంట నుంచి నిత్యం మండల వాసులతో పాటు పెనుగొండ, పోడూరు మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఆచంట చేరుకుని ఇక్కడ నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణిస్తూ ఉంటారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి కోడేరు రేవు దాటి ఆచంట చేరుకుని అనేకమంది ఆ జిల్లా వాసులతో పాటు పలు గ్రామాల ప్రజలు ఇక్కడ నుంచి ప్రయాణం చేస్తారు. ప్రయాణికులు ఇక్కడకు చేరుకునేసరికి వారికి నిలువ నీడ ఉండటం లేదు. ఆచంట బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో గత మూడేళ్ల కిందట తొలగించారు. నూతన షెల్టర్ కోసం గ్రంథాలయం వెనుక స్థలం కేటాయించినా.. ప్రభుత్వం మారడంతో ఆ నిర్మాణం కూడా వెనక్కుపోయింది. దీంతో బస్టాండ్‌ను నిర్మించలేదు. ఈ తరహాలో పాలకొల్లు, సిద్ధాంతం వెళ్లడానికి ఆచంట కచేరి సెంటర్ ప్రధాన కూడలి. వల్లూరు చుట్టుపక్కల ప్రయాణికులు ఎక్కడికి వెళ్లాలన్నా ఇక్కడికి రావాల్సిందే. ఈ నేపథ్యంలో ప్రయాణికులు వాహనాల కోసం గంటల తరబడి నడిరోడ్డు మీద నిలబడి నిరీక్షించవలసిన పరిస్థితి వస్తుంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఆచంటలో బస్టాండు నిర్మిస్తామని హామీ ఇవ్వని రాజకీయ నాయకులు లేరు. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రతిసారీ ఆచంట బస్టాండ్ నిర్మాణానికి కృషిచేస్తానని ప్రజలకు హామీలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం మరిచారు. ఎన్నికల సమయంలోనే నాయకులకు ఆచంట బస్టాండ్ నిర్మాణం గుర్తుకు వస్తుందని ప్రజలు బహాటంగానే విమర్శిస్తున్నారు.

నిత్యం వందలాది మంది ప్రయాణం..

మండలంలోని 12 గ్రామాల ప్రజలతో పాటు పెనుగొండ మండలంలోని చిన్న మల్లం, నడిపూడి, దేవా ముల్లపర్రు, ఇల్లపర్రు గ్రామాలు, పోడూరు మండలంలోని తూర్పుపాలెం, గుమ్మలూరు గ్రామాలకు చెందిన వందలాది మంది ఆచంటకు చేరుకుని విద్య, వైద్యం, వ్యాపార తదితరాల నిమిత్తం రావులపాలెం, రాజమండ్రి ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. వీరితోపాటు గోదావరి లంక గ్రామాల ప్రజలు ఎన్నోవ్యయ ప్రయాసలు కూర్చి ఆచంటకు వచ్చి ఇతర ప్రాంతాలకు వెళ్తారు. గత మూడు దశాబ్దాల క్రితం అప్పటి మంత్రి కోటగిరి విద్యాధరరావు కచేరి సెంటర్లో బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిధులు మంజూరు కాకపోవడంతో అప్పటినుంచి బస్టాండ్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైంది. ఆ శిలాఫలకం కూడా జాడ కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ప్రయాణికుల అవస్థలు తొలగించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఏళ్ల తరబడి అవస్థలు

నక్క ప్రేమ్‌కుమార్, పెనుమంచిలి, ప్రయాణికుడు

ఎన్నో ఇబ్బందులతో ఆచంటకు చేరుకుంటే ఇక్కడ కనీసం నీడ లేదు. ఎండకు ఎండుతూ రోడ్డు పైనే నుంచోవాలి. ఏళ్ల తరబడి మాకు అవస్థలు తప్పడం లేదు. బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు

ఎస్‌విఎన్.శర్మ, డివైఎఫ్ఐ నాయకులు

ఎంతోమంది ఎం ఎల్ఎలు, మంత్రులు ఇక్కడ బస్టాండ్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రయాణికులకు అవస్థలు ఎవరూ తీర్చలేకపోతున్నారు. బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నారు. ముఖ్యంగా కాలేజీకి వెళ్లే విద్యార్థుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నియోజకవర్గ కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల అవసరాల కనుగొనంగా ఆచంటలో బస్టాండ్ నిర్మించాలి.

పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం

పలుచోట్ల సామూహిక గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని మంగళగుంటపాలెంలో బుధవారం ప్రతి కుటుంబానికి సొంత చిరునామా సామూహిక గృహప్రవేశ మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రధాన వాగ్దానాలలో ఒకటైన ప్రతి కుటుంబానికి సొంత చిరునామా కార్యక్రమం క్రింద రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 3,00,192 ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలు పేదల కలల సాకారం అన్నారు. కూటమి ప్రభుత్వ ఘనత సిఎం నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 17 నెలల్లో పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే లక్ష్యంలో భాగంగా ఈ 3,00,192 ఇళ్లను పూర్తి చేసిందన్నారు. ఇది పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని ఆయన తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత, పారదర్శకత కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని, ప్రతి లబ్ధిదారునికి దాదాపు 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందించడం ద్వారా ఇంటి నిర్మాణ వ్యయాన్ని తగ్గించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళిక ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతిల్లు కల్పించాలనే లక్ష్యంతో 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత గృహం అందించడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పేదల అభ్యున్నతే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జిల్లా డెల్టా వైస్ ఛైర్మన్ గుబ్బల మరాజు, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షులు మైలా వసంతరావు, మండల అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్,ని ప్పులేటి తారకరామారావు, దేశనీడి గంగాధర్ పాల్గొన్నారు.

నరసాపురంలో..


తాడేపల్లిగూడెంలో..

పాలకొల్లు రూరల్‌లో..

తాడేపల్లిగూడెం : కూటమి ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పేదవారి సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన పథకం నడుం బిగించిందని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆయన పెంటపాడు మండలం చింతపల్లి గ్రామంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. అనంతరం పిఎంఎజివై కింద రూ.20 లక్షలు, చింతపల్లి గ్రామానికి 5 లక్షలు అభివృద్ధి పనులు మొత్తం రూ.25 లక్షల వ్యయంతో చింతపల్లి గ్రామానికి అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చాపల రమేష్, పుల్లా బాబీ, పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: కూటమి ప్రభుత్వంలో గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా మండలంలోని లంకలకోడేరు పెద్దపేటలో కూటమి నాయకుల ఆధ్వర్యాన గోగులమండ రత్నంరాజు గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. ఉన్నమట్ల కబర్ది, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయ భాస్కర్, దాసరి రత్నం రాజు, పాముల రజినీకుమార్, మామిడిశెట్టి పెద్దిరాజు, గండేటి వెంకటేశ్వరరావు, పెనుమత్స సత్యనారాయణ రాజు, మామిడి శెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా మహాసభ తేదీలు మార్పు

17, 18 తేదీల్లో మొగల్లులో నిర్వహణ

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరాం

భీమవరం : రైతు సంఘం 23వ జిల్లా మహాసభ నిర్వహణ తేదీలను మార్పు చేసినట్లు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరే రాం తెలిపారు. మొగల్లు గ్రామంలో ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఉన్న 20 మండలాల నుంచి ప్రతినిధులు మహాసభకు హాజరు కానునట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బి.బలరాం హాజరు కానున్నట్లు తెలియజేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధిస్తున్న సుంకాల వల్ల భారతదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ప్రభావంపై ప్రధానంగా చర్చించనున్నామని పేర్కొన్నారు. అన్ని రకాల పంటలపై వస్తున్న నష్టాలను అంచనా వేసి మహాసభలో తీర్మానాలు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ట్రస్ట్ ఆధ్వర్యాన భారీ అన్నదానం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కార్తీకమాసం సందర్భంగా భీమవరంలోని గునుపూడి రోడ్డులో ఉన్న శ్రీభోగలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నెలరోజుల పాటు యాత్రికులకు అన్న సమారాధన చేస్తున్నారు. బోడపాటి ప్రసన్న దేవి చారిటబుల్ ట్రస్ట్ ప్రతి ఏటా కార్తీకమాసంలో ప్రతిరోజు ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం ట్రస్టు నిర్వాహకులు బోడపాటి చినబాబు మాట్లాడుతూ కార్తీక మాసంలో భీమవరం ప్రజలే కాకుండా దూర ప్రాంతాల నుండి కూడా యాత్రికులు నిత్యం ఎక్కువగా ఈ ఆలయానికి వస్తుంటారని, వారికి స్వామివారి అన్న ప్రసాదాలను నెల రోజులపాటు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తన కుమార్తె ప్రసన్న దేవి పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

పంచాయతీలకు ట్రాక్టర్ ట్రక్కులు అందజేత

ప్రజాశక్తి - ఉండి


ట్రక్కులు అందజేస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ

పారిశుధ్య సమస్య నివారణకై ట్రాక్టర్ల అవసరాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం పలు పంచాయతీలకు ట్రాక్టర్ ట్రక్కులను బుధవారం అందజేసింది. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ సిఎస్‌వి రెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం కోలమూరు, ఉప్పులూరు, గణపవరం మండలం సరిపల్లె గ్రామాలకు గతంలోనే ట్రాక్టర్లు మంజూరయ్యాయని, వాటికి సంబంధించిన ట్రక్కులను నేడు అందజేయడం జరిగిందని అన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ ఇబ్బందిగా మారడంతో పంచాయతీల సర్పంచులు, కార్యదర్శుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లంతో నేడు వారికి సంబంధించిన ట్రక్కులను ఉండి మండల పరిషత్ కార్యాలయానికి పంపించడం జరిగిందని, వాటిని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేయడం జరిగిందని వారు వివరించారు.

టిడిపి మండల అధ్యక్షునిగా నాగరాజు


మండల అధ్యక్షులు నాగరాజు

ఉండి: పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయని టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు విషయంలో మరోసారి రుజువైంది. కూటమి ప్రభుత్వం ఆవిర్భవించిన తర్వాత గ్రామ, మండల కార్యవర్గాలను మార్చే విషయంలో తర్జనభర్జనల అనంతరం తిరిగి రెండోసారి కరిమెరక నాగరాజుకే మండల పగ్గాలు అప్ప చెప్పడం జరిగింది. దీంతో పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షునిగా ఉన్న నాగరాజు 2024 ఎన్నికల్లో పార్టీ పట్ల అంకితభావంతో పనిచేశారు. రెండోసారి మండల అధ్యక్షులుగా అవకాశం లభించడంతో నాగరాజుకు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో ఆర్‌డిఒ దాసిరాజు బుధవారం విడుదల చేశారు. ఈనెల 14న బాలల దినోత్సవంతో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు. 15వ తేదీ పుస్తక ప్రదర్శన పత్రికా పఠనం పోటీ, వ్యాసరచన పోటీ, 16వ తేదీ ప్రముఖులచే వివిధ ముఖ్యాంశాలపై ప్రసంగాలు తదనంతరం క్విజ్ పోటీ, 17వ తేదీ కవి సమ్మేళనం, రచయితలతోను సదస్సులు, సెమినార్లు, పాటల పోటీ, వక్తృత్వ పోటీ అంశం సమాజంపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం, 18వ తేదీ చదరంగం పోటీ, మ్యూజికల్ చైర్స్ పోటీలు, 19వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతపై చర్చ, వ్యాసరచన పోటీ అంశం క్రీడలలో మహిళల పాత్ర, 20వ తేదీ డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన, చదవడం మాకిష్టం కార్యక్రమంపై అవగాహనతో విద్యార్థులకు ఈ వారోత్సవాలు ముగుస్తాయన్నారు. ముగింపు సభలో బహుమతుల ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. ఈ వారోత్సవాల కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సహకార సంస్థలు, పుస్తక ప్రియులు పాల్గొని గ్రంథాలయ అభివృద్ధికి సహకరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బర్రి వెంకటరమణ, సుధీర్ మోహన్, సూర్యంబాబు, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ శుక్రవారం నుండి 20వ తేదీ గురువారం వరకు నిర్వహించనున్నామని గ్రంథాలయ పాలకులు భక్తుల హనుమంతరావు తెలిపారు. మొగల్తూరు లోని చిరంజీవి శాఖ గ్రంథాలయ ఆవరణలో వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం జ్యోతి ప్రజ్వలన పడవల మేరీ సత్యనారాయణ చేయనున్నారన్నారు. వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాలకోడేరు : ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గొల్లలకోడేరు గ్రంథాలయ అధికారి జి.బాలరాజు తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయంలో వివిధ ఆటలు పోటీలు నిర్వహించడంతోపాటు విజేతలకు బహుమతులు కూడా అందించనున్నట్లు తెలిపారు.

పెనుమంట్ర : ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పెనుమంట్ర శాఖ గ్రంథాలయ రీడర్ ఫారం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తాడిపర్తి ప్రియాంక భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు తెలిపారు. 14వ తేదీ ఉదయం బాలల దినోత్సవం పురస్కరించుకుని మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 25 వరకు వారం రోజులు వారోత్సవాలు జరుగుతాయని, ఈ వారోత్సవాలు విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారోత్సవాల సందర్భంగా కరపత్రం విడుదల చేశారు.

ఇండియన్ బ్యాంక్, కొత్తపేట, నూజివీడు బ్రాంచి
కొత్తపేట, నూజివీడు- 521201, ఏలూరు జిల్లా., ఎ.పి., ఫోన్:08656-232715

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఈ దిగువ పార్టీలు జ్యువెల్ / గోల్డ్ లోన్‌ను పొంది మరియు ఎన్ని నోటీసులు ఇచ్చినప్పటికీ నిర్ణీత సమయంలోగా విడిపించుకోవడంలో విఫలమయ్యారు. ఒకవేళ వీరు తాకట్టుపెట్టిన ఆభరణములు ది.15.11.2025 మధ్యాహ్నం 12.00 గంటల లోగా విడిపించుకోవడంలో విఫలమైతే, వారి యొక్క ఆభరణములను ది.15.11.2025, సాయంత్రం 3-30 గంటలకు మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలంపాటలో పాల్గొనువారు ధరావత్తు రూ.5,000/- ది.15.11.2025, మ॥ 2-00 గంటలలోపు చెల్లించవలెను.

ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా	లోన్ అకౌంట్ నెంబరు	మంజూరైన అమౌంట్	లోన్ యొక్క తేది	గరిష్ట బరువు
నూర్ భాషా ఇబ్రహీమ్, S/o.మౌలాసాహెబ్ 406, కొత్తపేట, వెంకటేశ్వర కోవెల వేణుక కొత్తపేట, నూజివీడు, క్రిష్ణా, ఎ.పి. పిన్ - 521201.	7041743324	రూ. 38,500 /-	13.07.2021	12.2 గ్రా॥
	7100399282	రూ. 52,000 /-	16.10.2021	17.0 గ్రా॥

ముఖ్య నియమ నిబంధనలు : 1) రిజిష్టర్డ్ నోటీసులకు పార్టీలు స్పందించలేదు లేదా బట్వాడా కాకుండా తిరిగి వచ్చినవి. 2) ఒకవేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. 3) ధరావత్తును బ్యాంకు వారు వేలం తేది మధ్యాహ్నం 2.00 గం॥ల వరకు మాత్రమే స్వీకరించబడును. 4) విజయవంతమైన పాటదారుడు వేలం ముగిసిన వెంటనే ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను. 5) వేలం సమయంలో మాత్రమే ఆభరణాలు తనిఖీ కోసం అందుబాటులో ఉంటాయి. 6) ఏవిధమైన ముందస్తు ప్రకటన లేకుండగనే వేలంను పాక్షికముగా గానీ పూర్తిగా గాని రద్దు చేయు లేదా వాయిదావేయు అధికారము బ్యాంక్‌కు కలదు. 7) వేలములో పాల్గొనేముందు బిడ్డర్లు ఋజువులను సమర్పించవలసి ఉంటుంది. 8) ఆభరణాలు "ఎక్కడ ఎలా ఉంటే అలాగే" షరతుల ప్రకారం మరియు బిడ్డర్ యొక్క రిస్క్ మరియు బాధ్యతతోనే వేలంలో విక్రయించబడును. మరిన్ని వివరాల కోసం పై చిరునామాలో బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.

తేది: 12.11.2025 ప్రదేశం: నూజివీడు సం/- శాఖాధికారి, ఇండియన్ బ్యాంక్

న్యుమోనియాపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

పిల్లలకు సోకే న్యుమోనియా వ్యాధి పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిప్పర పిహెచ్‌సి డాక్టర్ శ్రీదివ్య అన్నారు. న్యుమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం పిప్పర పిహెచ్‌సిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వ్యాధిపట్ల తల్లిదండ్రులకు సరియైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పిఎంపి మండల అసోషియేషన్ ఆధ్వర్యాన బుధవారం న్యుమోనియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోషియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షత వహించారు. ర్యాలీ సరిపల్లి కామాక్షి క్లినిక్ నుండి గణపవరం వరకు సాగింది. ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు మాట్లాడుతూ న్యుమోనియా అనేది ఊపిరితిత్తుల వాపు అన్నారు. ఇది ద్రవం పేరుకు పోవటానికి కారణం అవుతుందని చెప్పారు. ఈ వ్యాధి బాక్టీరియా లేదా వైరస్ వల్ల వస్తుందని చెప్పారు. న్యుమోనియా సోకితే శరీర ఉష్ణోగ్రత పెరగటం, చలి ప్రారంభమై పొడి దగ్గు ఉండి తరువాత కఫంతో కూడిన దగ్గు వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ట్రెజరర్ కొటకల అప్పారావు, ఈసి సభ్యులు మస్తాన్ వల్లి పాల్గొన్నారు.

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ. 1061/2025 ఇన్ ఓ.ఎస్. 392/25

కాసా వెంకటేశ్వర్లు ...పిటీషనరు/వాది

వర్సెస్

1) కలివేపల్లి సుబ్బారావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

టు,
ఆర్-3,
అచ్యుత శ్రీను, తండ్రి: హరిబాబు,
నివాసం: డోర్ నెం: 2-17, మెయిన్ రోడ్డు,
పాలచర్ల గ్రామం మరియు పోస్టు,
జిలుగు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాను మరియు పిటీషన్‌ను మీపై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు ఐ.ఎ. 1061/25 నోటీసులు జారీ చేసిననూ ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 27-11-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు కేసు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 27-11-2025 ఇ.శారద, అడ్వకేట్, మార్కాపురం.

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.ఎస్. 392/2025

కాసా వెంకటేశ్వర్లు ...వాది

వర్సెస్

1) కలివేపల్లి సుబ్బారావు మరియు ఇతరులు ...ప్రతివాదులు

టు,
డి-3,
అచ్యుత శ్రీను, తండ్రి: హరిబాబు,
నివాసం: డోర్ నెం: 2-17, మెయిన్ రోడ్డు,
పాలచర్ల గ్రామం మరియు పోస్టు,
జిలుగు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు దావాను వాది, ప్రతివాదులపై కోర్టులో దాఖలు చేయగా కోర్టు వారు దావా సమన్లు జారీ చేయగా, మొదటి, రెండు ప్రతివాదులకు సమన్లు ముట్టి లాయర్‌ను నియమించుకున్నారు. కానీ డి-3 అయిన నీకు సమన్లు ముట్టని కారణంగా పేపరు ప్రకటన కొరకు ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున తేదీ: 27-11-2025న ఉదయం 10:30 గంటలకు నీవు స్వయముగా లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా: 27-11-2025 ఇ.శారద, అడ్వకేట్, మార్కాపురం.

In the Court of the Addl. Senior Civil Judge, Eluru (Senior Division)
O.S.No.411/2015

Between:
Sri Chakka Uma Sankar Gupta ...Plaintiff
Vs
Sri Lanka Koteswara Rao and Others ...Defendants

D17: Sri Rayi Sujatha, S/o.Late Kommina Ganga raju, R/o. Madicharla, Nuzivid Mandal, Nuzvid, J.C.J.C., Krishna Dist.
D18: Sri Kommana Naga Jyothi, W/o.Satyanarayana, R/o.Denduluru Village and Mandal, Eluru Dist.

పై నెంబర్ గ్రంథములో Plaint Schedule ఆస్తి Register చేయించమని Court లో దాఖలు చేసిన పై నెంబర్ దావాలో 5వ ప్రతివాది కొమ్మిన గంగరాజు చనిపోయినందున వారి వారసులుగా D17, D18 లకు ఏమైన అభ్యంతరము ఉన్నయెడల ది.21.11.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారు ఎదుట హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షంగా ఆర్డర్‌పాస్ చేయబడునని ఇందు మూలంగా తెలియచేయడమైనది.

P.Bhaskara Narasimha Murthy
Advocate, Eluru.
Cell: 9848143125.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు
ఎ.ఎస్.నెం.38/2024

శ్రీ బొప్పన విఠల్ బాబు ...అప్పిలెంట్
మరియు
శ్రీ బూరగడ్డ వెంకట సుబ్బారావు (డైడ్)
శ్రీ కుతుంబాక రాంబాబు వగైరాలు ...రెస్పాండెంట్లు

పై నంబరు అప్పీలు గ్రంథములో 7వ రెస్పాండెంటు అయిన శ్రీ బూరగడ్డ ఎల్.వి.కె.కృష్ణమోహన్, తండ్రి బూరగడ్డ వెంకట సుబ్బారావు, పవరుపేట, ఏలూరు వారికి నోటీసు నిమిత్తం ది.27.11.2025వ తేదీకి వాయిదా అయివున్నది.

కాబట్టి 7వ రెస్పాండెంటు సదరు తేదీని పైకోర్టు వారి ఎదుట ఉదయం గం.1.30 ని॥లకు హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల వారి పరోక్షమున అప్పీలు తీర్మానించబడును.

ఏలూరు ఎస్.వి.ఆర్.గాంధీ
తేది.10.11.2025 అడ్వకేట్, ఏలూరు.